క్లుప్తంగా

ఎన్నికల హామీలు అమలు చేయాలి

పుత్తూరు: కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఇళ్లు లేని నిరుపేదలు పాల్గొన్నారు.

నవీన్‌కుమార్ కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న ప్రకాష్

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ ఆర్టీఐ ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ కుటుంబాన్ని ఆ పార్టీ నేతలు పరామర్శించారు. నవీన్ తండ్రి చిన్నముత్తయ్య ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఫోన్‌లో పరామర్శించారు. ముత్తయ్య పార్థివ దేహానికి వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


మధ్యాహ్న భోజనం తింటున్న ఎంఈఓ గిరిజ

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరంగా చేసి పెట్టాలని ఎంఈఓ గిరిజ ఆదేశించారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆమె మధ్యాహ్న భోజనం చేశారు. మెనూపై ఆరా తీశారు. నాణ్యతా ప్రమాణాలతో మెనూ పాటించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పాత్రలను సబ్బుతో శుభ్రం చేసిన తరువాతనే భోజనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ శరవణన్, ఉపాధ్యాయులు ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ చర్యలు

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్యసౌందర్య అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పశువులకు రోగాల నివారణకు టీకాలు వేసుకుని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాడి ఆవులకు పాల దిగుబడి తగ్గడం, జ్వరం, చొంగకారడం, కుంటడం తదితర లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్య సేవలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ


బ్యాగులతో విద్యార్థులు

నగరి: నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ టొబాకో కంట్రోల్ సర్వే, యాంటీ టొబాకో ప్రతిజ్ఞలో పాల్గొన్న విద్యార్థులకు ఆ పథకంలో వచ్చిన బ్యాగులను అందజేశారు. సోమవారం ఎమార్సీ కేంద్రం వద్ద ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం సర్వేలో పాల్గొన్న విద్యార్థులు రాగిణి, భవ్య, దీపక్ కుమార్, జ్యోత్స్న ప్రియ, సాయిశశాంక్, లిలియంలకు అందజేశారు. ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్ వితరణ


పాఠశాలకు టేబుల్ అందిస్తున్న దాత

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి, మాజీ సైనికుడు కొండూరు గజేంద్రవర్మ సోమవారం టేబుల్ వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ సైనికుడిగా దేశానికి సేవలు అందించి, చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో సహకరించిన గజేంద్రవర్మ అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చిన్నపాపమ్మ, రిటైర్డ్ ఎంఈఓ జయదేవరాజు, ఉపాధ్యాయులు సూరలక్ష్మి, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లు.. తప్పని తిప్పలు



- అధ్వానంగా మారిన రోడ్లు
- వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం
- నరకయాతన పడుతున్న వాహనదారులు


అధ్వాన్నంగా కుశస్థలి లోతట్టు వంతెన రోడ్డు


గుంతలమయంగా మంగళం రోడ్డు, (ఇన్‌సెట్) చెరువును తలపిస్తున్న నందిమంగళం రోడ్డు

నగరి: మున్సిపల్, మండల పరిధిలోని రోడ్లు అధ్వాన్నంగా మారాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారులన్నీ దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా కంకర తేలి, గుంతలు పడి, బురదమయమైన దారులే కనిపిస్తున్నాయి. రోడ్లపై వర్షపు నీటితో నిండిన గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. ఇక గ్రామాల్లో అయితే రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కిలోమీటర్ల మేర దారులు అధ్వాన్నంగా తయారవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అభివృద్ధి లేదు.. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయంటూ గతంలో ప్రచారాలు సాగించిన కూటమి పార్టీల నేతలు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా.. వారికి రోడ్ల గుంతలు కనిపించడం లేదు. రోడ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించిన కూటమి నేతలు.. అవన్నీ మాటలకే పరిమితమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను కూడా చూపడం లేదు. డబ్బుల్లేవు.. నిధుల్లేవు అంటూ అభివృద్ధి పనులను మరుగున పడేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాలకు వెళ్లే రహదారులు, గుంతలు పడడం, వర్షాలకు గుంతల్లో నీరు నిల్వడంతోపాటు బురద తేలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.


గుంతలమయంగా ఉన్న ముడిపల్లి రోడ్డు


బురద గుంతలతో చెర్లోపల్లి దళితవాడ రోడ్డు


అధ్వాన్నంగా నింద్ర ఎలకాటూరు రోడ్డు

ఆడికృత్తిక ఉత్సవాలు పరిసమాప్తం



ప్రత్యేక వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు, సారెను ఊరేగింపుగా తీసుకొస్తున్న చింతతోపు ఎస్టీ కాలనీ వాసులు

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై ఉన్న వల్లీ దేవ సేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో నిర్వహించిన ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. తొలుత అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పూజార్చనలు, అభిషేకాల అనంతరం పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అలాగే వేద పండితులు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు.. భక్తులు చివరి రోజు కూడా కావళ్లతో వచ్చి మొక్కులు చెల్లించారు.

సారె సమర్పణ

ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం ఆనవాయితీ ప్రకారం చింతతోపు ఎస్టీ కాలనీ వాసులు వల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామికి పట్టు వస్త్రాలు, పుష్పమాలికలతో కూడిన సారెను సమర్పించి మొక్కులు చెల్లించారు. చింతతోపు యువత ప్రత్యేక వాయిద్యాలకు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

తెప్పపై విహారం

స్కంధ పుష్కరిణి ఏర్పాటు చేసిన తెప్పపై వల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి మంగళవాయిద్యాల నడుమ విహరించారు. భక్తులు బెల్లం, మిరియాలను పుష్కరిణిలో చల్లారు. కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ క్రిష్ణనాయక్, రవియాదవ్, రాజశేఖర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్నట్లు మాజీ మంత్రి నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మి

● ఆశీస్సులు

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ ధర్మాచెరువులో సోమవారం జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి హాజరయ్యారు. నూతన వధూవరులు తేజ, ప్రవీణ్‌లను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, మాజీ ఎంపీటీసీలు రోశిరెడ్డి, మురగయ్య, నాయకులు పొన్నయ్య, అమర్‌నాథ్, రిటైర్డ్ టీచర్ గుర్రప్ప, అనిల్, మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి తట్టుకోలేకే దుష్ప్రచారం


మాట్లాడుతున్న కోలార్ ప్రకాష్

వెదురుకుప్పం: నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టాల్లో పాలుపంచుకునే మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుటుంబానికి వస్తున్న ప్రజా స్పందన, ఆదరణ చూసి ఓర్వలేకే ఆ కుటుంబంపై నిత్యం విషం కక్కుతున్నారని వైఎస్ఆర్ సీపీ వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్ అన్నారు. సోమవారం నారాయణస్వామి కుటుంబంపై వచ్చిన పచ్చి అబద్ధాలు, అవాస్తవాలపై ఆయన వెదురుకుప్పంలో మీడియాతో మాట్లాడుతూ ఖండించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ఉప ముఖ్యమంత్రిపై తప్పుడు ప్రచారం చేసేవారు ఆధారాలను బయటపెట్టాలన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నించే దమ్ము ధైర్యం లేక కూటమి నాయకులకు అమ్ముడు పోయిన కొందరు స్వప్రయోజనాల కోసం నారాయణస్వామి కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ సీపీ హయాంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు ఆదరించిన తీరు కొందరికి మింగుడు పడడం లేదన్నారు. ఎవరి రాజకీయ ప్రయోజనాల కోసం ఇలాంటి పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని ప్రశ్నించారు. ఇన్‌చార్జిగా కృపాలక్ష్మి నిత్యం ప్రజలతో మమేకమై పార్టీకి కష్టపడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొంత మంది దుర్మార్గులు వారి ఉనికి కోల్పోతుండడంతో చేసేది లేక తప్పుడు కూతలు కూస్తున్నట్లు చెప్పారు. ఇంకోసారి దుష్ప్రచారం చేస్తే తగినరీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ముక్కలత్తూరులో వినోద్ కుటుంబంతో..., మోహన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృపాలక్ష్మి

గంగాధరనెల్లూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మామిడి రైతులకు అండగా నిర్వహించిన బంగారుపాళ్యం పర్యటనలో పాల్గొన్న వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారు. ఈ కేసుల్లో 37 రోజులపాటు జైలు జీవితం గడుపుతున్న గంగాధరనెల్లూరు మండల కేంద్రానికి చెందిన మోహన్ కుటుంబాన్ని, ముక్కలత్తూరు గ్రామంలోని వినోద్ కుటుంబాలను సోమవారం నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి ఆయా గ్రామాల్లో పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆధ్వర్యంలో కార్యకర్తలకు, నాయకులకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడుతానని తెలిపారు. అన్ని విధాలా తోడుంటానని హామీ ఇచ్చారు. ఆమె వెంట మండల పార్టీ కన్వీనర్ వెంకటరెడ్డి, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసారం ఆధారంగా ఎరువులు వాడాలి

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేసి, వాటి ఆధారంగా ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి తులసీరాం అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నింద్రలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించి లోపాలను గుర్తించాలని, కావాల్సిన పోషకాలను వాడాలని అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చింత లేని ఆరోగ్యం


మాట్లాడుతున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: చిరు ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మండల వ్యవసాయాధికారి ఢిల్లీ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం కల్పలతరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సంఘాల మహిళలకు రాగులు, ఇతర చిరు ధాన్యాల పంటలతో ఆరోగ్య లాభాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ మహిళలు చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకుంటే రక్తహీనత తగ్గుతుందని తెలిపారు. చిరు ధాన్యాల వాడకం, సాగుపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విజ్ఞానాన్ని వివరించారు. రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా సహజ పద్ధతుల్లో చేసే వ్యవసాయమే ప్రకృతి సేద్యమని వివరించారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గి మొక్కలు భూమిలోని పౌష్టిక విలువలు పోతున్నాయని పేర్కొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిరండి


కరపత్రాలు విడుదల చేస్తున్న నేతలు

నగరి: సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ కడపలో ఈ నెల 30, 31వ తేదీలలో నిర్వహించనున్న 3వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోదండయ్య, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామరై పిలుపునిచ్చారు. సోమవారం పట్టణ పరిధిలోని తమ కార్యాలయం వద్ద మహాసభల కరపత్రాలను వారు విడుదల చేశారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, టీఏ, డీఏలను ఇవ్వాలని, మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి వైద్య సిబ్బందికి వర్తించే సెలవులన్నీ ఆశాలకు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని, ఏఎన్ఎం పూర్తి చేసిన ఆశలకు ఏఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరుతూ సభను నిర్వహిస్తున్నట్లు వారు పేరొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వేలన్, యేసయ్య ముత్తు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఉషారాణి, విజయలక్ష్మి, వెంకటమ్మ, అన్నపూర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పారిశుధ్యం మెరుగుకు కృషి


అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ సీఈఓ, డీపీఓ

శ్రీరంగరాజపురం: గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేయాలని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావుతో కలసి కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శానిటేషన్‌పై సమీక్షించారు. ప్రతి గ్రామంలో ఉదయం 7 గంటల్లోపు ఇంటింటా చెత్త సేకరించాలని, క్లోరినేషన్ చేసి మంచి నీటిని సరఫరా చేయాలన్నారు. ఎంపీడీఓ మోహన్ మురళి, డిప్యూటీ ఎంపీడీఓ కేశవులు పాల్గొన్నారు.

పులిగుంటీశ్వరాలయ పునర్నిర్మాణం

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


బాలాలయ పూజల్లో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో వెలసి ఉన్న శ్రీపులిగుంటీశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేద మంత్రాల నడుమ బాలాలయ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెనుమూరు మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న పులిగుంటీశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణానికి సుమారు రూ.5 కోట్లు వెచ్చిస్తామన్నారు. ఈ క్రమంలో భాగంగా వేద పండితులు మాజీ ఉప ముఖ్యమంత్రికి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకుడు రాకేష్‌రెడ్డి, ఎంపీపీ హేమలతారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ సురేష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఉమాపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన


వర్షంలో రాత్రి సమయంలో నీవానది వంతెనపై ఇక్కట్లు


లైట్లు లేని నీవానది వంతెన

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని నీవా నదిపై ఉన్న వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. చిత్తూరు నుండి పుత్తూరుకు వెళ్లే వైపు వంతెనకు మొదట్లో గతంలో ఓ గుర్తు తెలియని వాహనం వాల్‌ను ఢీకొనడంతో కొద్ది భాగం ధ్వంసమైంది. అప్పటినుండి అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. చిత్తూరు నుండి వచ్చే వాహనాలు వంతెన పైకి రాగానే ఈ ప్రదేశంలో ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉండడంతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. అలాగే వంతెనపై రాత్రి సమయాలలో ప్రయాణించాలంటే తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రస్తుత వర్షాకాల పరిస్థితులలో వంతెనపై ప్రయాణికులు ఇక్కట్లు పడుతుంటే అధికారులు ఇదే దారిలో వెళ్తున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇకనైనా వంతెన మొదట్లో ప్రహరీ నిర్మాణ పనులు చేసి, వంతెనపై లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


ప్రమాదకరంగా జీడీ నెల్లూరు వంతెన